క్లుప్తంగా

చురుగ్గా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



చురుగ్గా జరుగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

సాలూరు: పట్టణంలో గుమడాం వద్ద గల జగనన్న లే అవుట్ వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ,సుమారు రూ.3 కోట్లతో ఈ పనులు సాగుతున్నాయి. లే అవుట్ వద్ద సుమారు 1500 ఇళ్లు మంజూరై చురుగ్గా పనులు జరుగుతున్నాయి. సమీపంలో టిడ్కో ఇళ్లు నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చి, త్వరలో గృహ ప్రవేశాలు జరగనున్నాయి. 5 ఎమ్‌వీఏ సామర్థ్యంతో జరుగుతున్న సబ్‌స్టేషన్ పనులు రెండు నెలల్లో పూర్తి చేయడానికి ఎలక్ట్రికల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సాలూరు: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని పట్టణ అగ్నిమాపక శాఖ అధికారి పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో పెట్రోల్ బంక్‌లు వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు మంగళవారం ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవించే అవకాశం ఉంది, అవి సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను కూలంకుషంగా వివరించారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండపురంలో వైఎస్సార్ కంటి వెలుగు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణారావు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కంటివైద్యుడు టి.కృష్ణారావు ఆధ్వర్యంలో 60 ఏళ్లు పైబడిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. 11 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయనున్నట్లు చెప్పారు. 16 మందికి కళ్లద్దాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.వనజ, ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్‌ఎం కుమారి, ఎంపీహెచ్‌ఏ ఆర్.శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు సేవలందించారు.


విక్రంపురంలో వైద్య శిబిరం



బీపీ చెక్ చేయించుకుంటున్న డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మల్లేశ్వరావు

కొమరాడ: మండలంలోని విక్రంపురంలో భారతీయ హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యూలైఫ్ చర్చి సహకారంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరావు శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు వైద్య సేవలందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్లేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో బీహెచ్ఆర్‌సీ చైర్‌పర్సన్ డీపీపీసీ సాహు, వైస్ చైర్మన్ పి.నాగేశ్వరరావు, వైద్యులు ఎస్.ప్రభు, ఎం.కోటి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జి.శివడలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రజ్ఞ

కురుపాం: మండలంలోని జి.శివడ గ్రామంలో 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రజ్ఞ 58 మందికి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటి వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్ పి.మహేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.నాగేశ్వరరావు, హెల్త్ విజిటర్ పి.భారతి, హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఏఎన్‌ఎం ఎ.సుఖవాసి, ఆశార్కర్లు సేవలందించారు.

ఇంటింటికీ 'జగనన్నే మా భవిష్యత్'

పార్వతీపురంటౌన్:

ఇంటింటికి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పట్టణ, మండల నాయకులు నిర్వహించారు. మంగళవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు జగనన్నే మా నమ్మకం మా భవిష్యత్ కార్యక్రమాన్ని గ్రామాలు, వార్డుల్లో పెద్దలతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులంతా గడపగడపకు వెళ్లి నేరుగా కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చేకూరిన లబ్ధిని వారికి వివరిస్తూ గత ప్రభుత్వంలో మోసపోయిన మోసగించిన విధానాన్ని విడమరిచి రెండు ప్రభుత్వాలకు తేడాలు వివరించారు. అలాగే ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచిన ఐదు ప్రశ్నలను అడిగి అవును అని సమాధానం చెప్పినట్లయితే రసీదు అందించాలని కోరారు. ప్రజల మద్దతు స్వీకరిస్తూ వారి ఇంటి గోడపై 'జగనన్నే మా భవిష్యత్తు' 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్‌ను ఫోన్ పై అతికించారు. మళ్లీ జగన్ పరిపాలన కావాలని రావాలని ప్రజల విశ్వసించడంతో పాటు మిస్డ్ కాల్ ఇచ్చి వారి పూర్తిస్థాయి మద్దతు తెలిపారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో 11 రోజులుగా వాడవాడలా జరుగుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు'' మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పండగ వాతావరణంలో ప్రతిఇంటికీ వెళ్లడంతో ప్రజలు వారిని ఆదరిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రంగంపేట, జానుమల్లువలస, గుమ్మిడివరం, అనంతరాయుడుపేట, బుడ్డిపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల కు తామంతా సంక్షేమ పథకాలు ఇంటికి తెచ్చి ఇస్తున్న జగనన్న ప్రభుత్వానికి మద్దతు నిస్తామని చెబుతూ ప్రజలు స్వచ్ఛందంగా స్టిక్కర్లు ఇళ్లలో అమర్చుకుం టున్నారు. జానుమల్లువలసలో సచివాలయ కన్వీనరు యాళ్ల విజయమ్మ, పార్టీ నాయకులు పారినాయుడు, శివున్నాయుడు ఇంటింటికీ వెళ్లి జగనన్న పేరుతోఉన్న స్టిక్కర్లను ఇంటి యజమానుల అంగీకారంతో గోడలకు అంటించారు. లచ్చయ్యపేటలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, కన్వీనర్లు స్టిక్కర్లు అతికించి మెగాపీపుల్స్ సర్వే నిర్వహించారు.



పార్వతీపురం టౌన్: పట్టణంలోని జగన్నాథపురం కాలనీలో అభిప్రాయ సేకరణలో నాయకులు



సీతానగరం: జానుమల్లువలసలో ఇంటింటికీ వెళ్లి 'జగనన్నే మా భవిష్యత్' కరపత్రాలు అందజేస్తున్న కన్వీనర్ విజయలక్ష్మి

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశాలు

సీతానగరం: మండలంలో రాకపోకలకు అనుకూలంగా, నాణ్యమైన విద్యాబోధనకు నెలవుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతున్నాయని కళాశాల అధ్యాపకులు రవికుమార్, రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస, బూర్జ గ్రామాల్లో పదోతరగతి పబ్లిక్‌పరీక్షలు రాసిన విద్యార్థుల పేరెంట్స్‌తో కలిసి పిల్లల్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించాలని కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక సూచనల మేరకు గ్రామాల్లో పర్యటించి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. మౌలిక వసతులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమపథకాలు పొందాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, సీఈటీ, ఎంఅండ్ఎట్, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) గ్రూపులున్నాయని, స్థానికంగానే ప్రభుత్వం విద్యార్థుల కోసం ల్యాబ్ సౌకర్యం కల్పించిందని వివరించారు.



చెల్లన్నాయుడువలసలో విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు టి.రవికుమార్, ఎ. రామారావు

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

సాలూరు: మండలంలో పట్టుచెన్నేరు సచివాలయ పరిధిలోని పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నటుట ఎంపీడీఓ పార్వతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఉచిత శిక్షణపై హర్షం

గుమ్మలక్ష్మీపురం: గిరిజన విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంపై గిరిజన సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన బాలికలకు కూడా వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. అలా సాధ్యం కాని పరిస్థితి ఉంటే పార్వతీపురం కేంద్రంలో గిరిజన బాలికల కోసం భోజన, వసతి సౌకర్యంతో మరో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

55 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో ఆశయ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వైద్యులు 55 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అందులో 22 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వారికి విశాఖపట్నంలోని ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మహేష్, ఆశయ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గుల్ల హరిప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో ఉచిత రక్తపరీక్షలు, ఈసీజీ, ఎకో, తదితర వైద్య పరీక్షలతో పాటు మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు

పార్వతీపురం టౌన్: ఖరీఫ్ ప్రణాళికపై ర్యాలీలు, దండోరా, మహిళా సంఘాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో ఖరీఫ్ ప్రణాళిక సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతుకు ఉన్న విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించిన రైతులు వివరాలు స్వయం సహాయక సంఘాల వారీగా, పంటల వారీగా సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. నవధాన్య విత్తనాల సేకరణ, పంపిణీ చేయాలని చెప్పారు. బీజామృతం, జీవామృతం, అచ్ఛదన, వాపసు పాటిస్తే ప్రకృతి వ్యవసాయం సులువుగా చేయవచ్చని చెప్పారు. ఖరీఫ్ సాగుకు ముందుగా ఘనజీవామృతం, పీఎండీఎస్ విత్తనాలు ప్రకృతి వ్యవసాయానికి ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఏఓ తిరుపతి రావు, జిల్లా సహాయ ప్రబంధకుడు ఎస్. ధనుంజయరావు, జిల్లా కో ఆర్డినేటర్ దేవిప్రసాద్, ఎంటీలు, డివిజన్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవార్ల పండగకు భారీ ఏర్పాట్లు



అమ్మవారిని కొనితెచ్చే కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామ దేవతలు ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ పండగ ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పండగలో భాగంగా పొలిమేరలో ఉన్న అమ్మవారిని గ్రామ ప్రజలు, పెద్దలు ఏకమై పిలుపునిచ్చే (కొనితెచ్చే) కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. పొలిమేర నుంచి గ్రామంలోకి ప్రవేశించిన అమ్మవారికి మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం నుంచి గ్రామాల్లో అమ్మవారి ఘటాలతో 4 రోజుల పాటు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి పూజ కార్యక్రమం పార్వతీపురం రాజులు థాట్రాజ్ కుటుంబం ఘనంగా నిర్వహిస్తారన్నారు. అనంతరం గ్రామమంతా ఘటాల ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

గ్రామ దేవత అక్క ఇప్పల పోలమ్మకు జరిగిన పద్ధతిలోనే జగన్నాథపురం ఎర్ర కంచమ్మ పండగ ఏర్పాట్లు కూడా ఇదే పద్ధతుల్లో జరుగుతాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తర్వాత ఇదే తొలి పండగగా భావించిన పెద్దలు ఘనంగా జరిపించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నారు. పార్వతీపురం గ్రామదేవత ఇప్పల పోలమ్మ, జగన్నాథపురం ఎర్రకంచమ్మల పండగ మే నెల 28, 29, 30న జరగనుందని, సిరిమాను మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి



గ్యాస్ సిలిండర్ పేలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- అగ్నిమాపక అధికారి యు.సుధాకరరావు

పార్వతీపురం టౌన్: చిన్న చిట్కాలతో పెద్ద ప్రమాదాలు నియంత్రించ వచ్చని, అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి అని పార్వతీపురం అగ్నిమాపక అధికారి యు.సుధాకరరావు అన్నారు. అగ్నిమాపక భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రాంగణంలో అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి మాట్లాడుతూ జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. వారోత్సవాలలో భాగంగా గ్యాస్ సిలిండర్‌లు పేలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్ పేలినప్పుడు, అధిక ఉష్ణోగ్రతల వల్ల పొలాల్లో గడ్డివాములు కాలిపోతాయని, అటువంటి అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన పడకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఆలోచించాలని సూచించారు. వివిధ ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది టి.ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలు తీవ్రం: ప్రజలు అప్రమత్తం

- తహసీల్దార్ ఎన్వీరమణ



సీతానగరం: ఎండల తీవ్రత కారణంగా ప్రజలు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని, అత్యవసర పరిస్థితులైతే తప్ప రోజూ ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటలవరకూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని తహసీల్దార్ ఎన్వీ రమణ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు సంస్థ, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అన్ని గ్రామాల్లో వీఆర్వోల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలియజేశారు. రోజూ మధ్యాహ్నం సమయానికి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండలు తీవ్రంగా ఉంటున్నాయని ప్రజలు వడగాడ్పుల బారిన పడి గుర్రై అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితిలో రావలసి వస్తే విధిగా కాళ్లకు చెప్పులు, గొడుగు, చేతితో మంచీరు బాటిల్ పట్టుకుని వెళ్లాలని సూచించారు. అలాగే నాలుగు రోజులు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

ఉపాధివేతనదారులు సమయపాలన పాటించాలి



మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్

సీతానగరం: ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే మండలంలోని వేతనదారులు ఎండకు గురికాకుండా సమయపాలన పాటించాలని, ఏరోజుకారోజు మస్తరును వేయించుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం సూరంపేటలో ఉపాధిహామీ పనులు చేస్తున్న చెరువులో వేతదారులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉంటాయని ఉదయం 11 గంటల్లోగానే పనులు ముగించుకుని ఇళ్లకు చేరాలని హెచ్చరికలు జారీ కావడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి బయటకు వెళ్లేవారంతా చల్లనినీరు. లేదా చల్లని మజ్జిగ చేత పట్టుకుని నెత్తిన టోపీ, కాళ్లకు చెప్పులు విధిగా ధరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

సీతానగరం: మండలంలోని ప్రధాన కూడళ్లలో వాహనచోదకులు, పాదచారుల దాహం తీర్చడానికి మంగళవారం చలివేంద్రాలు ప్రారంభించారు. మక్కువ- చినభోగిలి ప్రధాన రహదారిలో ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ సూచనల మేరకు బగ్గందొరవలస రామమందిరం వద్ద పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై కె.నీలకంఠం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశారు. వారం రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు తాగునీరు కోసం ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రధాన రహదారుల్లో కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావడం శుభపరిణామమని వాహన చోదకులు సర్పంచ్ ఎ.నారాయణరావు, వై శ్రీనివాసరావు అన్నారు.



బగ్గందొరవలసలో చలివేంద్రాన్ని ప్రారంభించిన పీఎస్ శ్రీనివాసరావు

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కురుపాం, భామిని: కురుపాం, బత్తిలి పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసులు, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట కురుపాం ఎస్సై సీహెచ్ ప్రసాద్, బత్తిలి ఎస్సై వై.అమ్మన్‌రావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



కురుపాం: పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కొమరాడ: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని, ప్రజా సమస్యలపై సత్వరం స్పందించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండలంలోని ఉలిపిరి, చోళ్లపదం గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. పౌరసేవలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను గోడలకు వేలాడదీయాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఉలిపిరి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

- ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

పార్వతీపురం టౌన్: ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణుల వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి గర్భిణులను వసతిగృహాల్లో చేర్చాలని అక్కడ అన్ని వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మంచి సేవలు అందించాలని ఆదేశించారు. తద్వారా హై రిస్క్ సమస్య తలెత్తే అవకాశం ఉండదని అభిప్రాయ పడ్డారు. రక్తహీనత పరీక్షలు అందరికీ నిర్వహించి తగిన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంపూర్ణ పోషణ కిట్లు విధిగా అందాలని వాటిపై స్పష్టమైన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. తల్లిపిల్లల ఆధార్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాలను సంబంధిత పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఇమ్యునైజేషన్ ప్రతి ఒక్కరికీ జరగాలని స్పష్టం చేశారు. ఇమ్యునైజేషన్ చేయడంలో ఎటువంటి అలసత్వం ఉండరాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్

వ్యాధుల పట్ల అవగాహన

సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి జీవన విధానంలో చిన్న మార్పులు వల్ల అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలియజేయాలని ఆయన చెప్పారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. స్ప్రేయింగ్ కార్యక్రమం పక్కాగా జరగాలని ఆదేశించారు. ఫీడర్ అంబులెన్సులు, 104, 108, 102 వాహనాల అందుబాటు, సేవలు సంతృప్తికరంగా ఉండాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది అందరూ విధిగా బయో మెట్రిక్ హాజరు వేయాలని, నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి. జగన్‌మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ డీవీ రమణ, ప్రోగ్రాం అధికారి డా. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.